ప్రజాశక్తి
శనివారం 27 ఏప్రిల్ 2024
I
అల్లూరి సీతారామరాజు

సజావుగా నామినేషన్ల పరిశీలన

- అల్లూరి జిల్లాలో 103కిగాను 31 తిరస్కరణ

ప్రజాశక్తి - పాడేరు : అల్లూరి జిల్లాలో రంపచోడవరం, అరకు, పాడేరు అసెంబ్లీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం సజావుగా సాగింది. జిల్లాలోని ఈ మూడు అసెంబ్లీ స్థానాలకు మొత్తం 103 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో అరకు అసెంబ్లీ స్థానానికి దాఖలైన 44 నామినేషన్లకుగాను 19ని తిరస్కరించారు. రంపచోడవరం అసెంబ్లీ స్థానానికి దాఖలైన 26 నామినేషన్లకుగాను ఐదు నామినేషన్లను తిరస్కరించారు. పాడేరు అసెంబ్లీ స్థానానికి దాఖలైన 33 నామినేషన్లకుగాను ఏడు నామినేషన్లను తిరస్కరించారు. జిల్లాలో మొత్తం 31 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 17 మంది అభ్యర్థులు దాఖలు చేసిన 26 నామినేషన్ పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించామని రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి యస్.ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు.

బిజెపి, పొత్తు, తొత్తు పార్టీలను ఓడిస్తేనే...

ఆదివాసీల చట్టాలు, హక్కులకు రక్షణ

సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని విస్తృత ప్రచారం

దేవీపట్నం మండలంలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

చింతూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని, దాని పొత్తు పార్టీలు టిడిపి, జనసేనను, తొత్తు పార్టీ వైసీపీని ఓడిస్తేనే ఆదివాసీ హక్కులు, చట్టాలు కాపాడుబడతాయని సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ అన్నారు. ఇండియా వేదిక బలపర్చిన సిపిఎం అరకు ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను, రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావును గెలిపించాలని కోరుతూ మండలంలోని మధుగూరు గ్రామంలో శుక్రవారం విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం, ఆదివాసీల హక్కుల కోసం, గిరిజన ప్రాంత సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సిపిఎం పార్టీ అభ్యర్థులను సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, పాండు సుబ్బారావు, సోయం రాజులు, సోయం భారతి, మనోజ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం : మండలంలోని దేవీపట్నం, రమణయ్యపేట, మంటూరు, కృష్ణయ్య పాలెం, దండంగి, నేలదొండపాడు కొండ మొదలు, ఆర్ అండ్ ఆర్ తదితర కాలనీల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు జి.వెంకటరావు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థులకు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారంలో కేంద్ర బిజెపి, రాష్ట్రంలో గత టిడిపి, నేటి వైసిపి ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని మండిపడ్డారు. పోలవరం నిర్వాసితులకు అన్యాయం చేసిన వారికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రామకృష్ణ, వి సాయిబాబు, ఎ.శ్యామల రాణి, బుల్లెమ్మా, కె విజయలక్ష్మి, జి సూర్యకిరణ్, జె గోపి, సాయి కృష్ణ, చంటి, బేబమ్మ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : ప్రజా సమస్యలపై పనిచేసే సిపిఎం అభ్యర్థులకే ఓటు వేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు మట్ల వాణిశ్రీ పిలుపునిచ్చారు. సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ శుక్రవారం సిపిఎం నాయకులు ప్రచారం చేశారు.

సీలేరు : అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్సను గెలిపించాలని కోరుతూ జీకే వీధి మండలం వంచుల, జర్రెల పంచాయతీల పరిధిలోని నడివీధి, దబ్బగొంది, చింతలవాడ, రాళ్లగడ్డ, కొండ్రుపల్లి, గిలగొంది, బోడల గొంది, అస్సాంపల్లి, కన్నీరిసిల్లప్ప, గడ్డిమామిడి తదితర గ్రామాల్లో శుక్రవారం సిపిఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు గడుతూరి సత్యనారాయణ, మురళి, చంటిబాబు, కోరాబు బోడయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్సకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని సాగర పంచాయతీ అడపవలస గ్రామంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ సీనియర్ నాయకులు ఆర్.రాము మాట్లాడుతూ, ఆదివాసులకు ఎటువంటి సమస్య వచ్చినా సిపిఎం అండగా నిలబడుతుందన్నారు. ఆదివాసుల సమస్యలతో పాటు గిరిజన హక్కులు, చట్టాలపై పూర్తిగా అవగాహన ఉండి వాటి అమలుకై నిరంతరం పోరాటం సాగిస్తున్న ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు టి సూర్యనారాయణ, రమేష్, రవి, లైకోన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అప్పలనర్సను గెలిపించాలని మండలంలోని గత్తన్నగుడ, బొడుగూడలో సిపిఎం నేతలు ప్రచారం చేపట్టారు. ఉపాధి పనులు చేస్తున్న ప్రదేశాల్లో కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. సిపిఎం నాయకులు మాట్లాడుతూ, జిఒ 3 చట్ట బద్ధతకు సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి బాలదేవ్, జన్ని భగత్, మండల కార్యదర్శి రామారావు, రామ్, ధర్మ, హరి పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలోని రోగుల పేట లో సిపిఎం నేతలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బొండా సన్నిబాబు, వివి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మైనింగ్ పేరుతో గిరిజన ప్రాంతాన్ని నాశనం చేస్తున్న బీజేపీ, దానికి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించాలన్నారు. బిజెపి ప్రభుత్వం వచ్చిన ఈ 10 ఏళ్లలో గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి చేయకపోగా గిరిజన హక్కులను మరింతగా హరించిందని విమర్శించారు.బిజెపిని దానికి అనుకూలంగా ఉన్న పార్టీలను ఓడించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొండ గంగాధర్, పప్పుల బుజ్జిబాబు, జె సునీల్ కుమార్, నరేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి: లంబసింగి సంతలో సిపిఎం నేతలు ప్రచారం చేశారు. సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనుంజయ్ మాట్లాడుతూ, సిపిఎం నేతలు ఉంటేనే ఏజెన్సీకి మంచిదని ప్రజలు నమ్ముతున్నారన్నారు. మతోన్మాద పార్టీ బిజెపి రాష్ట్రానికి చాలా ద్రోహం చేసిందని విమర్శించారు.గిరిజన హక్కుల రక్షణకై పార్లమెంటుకు అప్పలనర్సను పంపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సాగిన చిరంజీవి, పాంగి జీవన్ కృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది సిపిఎం అని జెడ్పీటీసీ దీసరి గంగరాజు తెలిపారు. పెద్దబిడ్డ, నందులవలస, వంజెలవలస, గుమ్మ గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. మరో సిపిఎం బృందం బూరిగ, చిన్నకోన్న, గమ్మ, కర్రిగొడ, కడరేవు గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యధర్శి ఎస్.నాగులు. టోకురు సర్పంచ్ కె , మొస్య, నాయకులు బంద్రయ్య, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు

అనంతగిరి మండలంలో ప్రచారం చేస్తున్న దీసరి గంగరాజు

మూగబోయిన సెల్ సేవలు

నాలుగు రోజుల నుంచి బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల అవస్థలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో బిఎస్ఎన్ఎల్ సెల్ సిగ్నల్ సౌకర్యం గత నాలుగు రోజుల నుంచి మూగ బోయాయి. దీంతో, ఇంటర్నెట్ వినియోగ దారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యం కోసం బ్రాడ్ బాండ్ సౌకర్యాన్ని కల్పించుకొని ఉన్న వారికి పనులు జరగ లేదు. దీంతో సకాలంలో ప్రభుత్వ కార్యాలయంలో పనులు జరగకపోవడంతో ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడకు తప్పలేదు. వ్యాపార అవసరాల కోసం ఇంటర్నెట్ కేంద్రాల్లో ముందుగా బిఎస్ఎన్ఎల్ బ్రాస్బెండ్ ఇంటర్నెట్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. గత నాలుగు రోజుల నుంచి సిగ్నల్స్ అందక లేక వ్యాపారాలు జరగక పోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని ఇంటర్నెట్ కేంద్రాల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌కు ఫోన్లు కాక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని పలువురు అంటున్నారు. గత నాలుగు రోజుల నుంచి బిఎస్ఎన్ఎల్ సిగ్నల్స్ మూగబోయినా సంబంధిత అధికారుల నిర్లక్ష్యంపై వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నేడు మన్యంలో షర్మిల పర్యటన

-పాడేరులో బహిరంగ సభ
-హుకుంపేటలో రోడ్ షో

ప్రజాశక్తి-హుకుంపేట: మండల కేంద్రంలో ఈనెల 27న శనివారం పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రోడ్ షో నిర్వహించనున్నారని ఇండియా ఫోరం నేతలు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు.అరకు సీపీఎం ఎంపీ అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స, ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టి గంగాధర్‌స్వామిల గెలిపించాలని కోరుతూ స్థానిక మోద కొండమ్మ తల్లి గుడి నుండి పెట్రోల్ బంక్, జే సీ ఈ ఎఫ్ చర్చ్, మసీదు మీదుగా మెయిన్ రోడ్డు, సంత కామయ్యా పేట జంక్షన్ వరకు షర్మిల రోడ్ షో జరగనుందని, ప్రజలు పాల్గోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు,)కాంగ్రెస్ పార్టీ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కిముడు ఆదినారాయణ, సీనియర్ నాయకులు కూడ రామలింగం, తడిగిరి మాజీ సర్పంచ్ పూజారి రామారావు, దుర్గం మాజీ ఎంపీటీసీ పెనుమల క్రాంతి రాజు,మండల వైస్ ప్రెసిడెంట్ వంతాల రామకృష్ణ ,సీపీఎం మండల నాయకులు తాపుల కృష్ణారావు, పాంగి సోమన్న, కాంగ్రెస్ ఇంచార్జ్ లు జానకి రామ్, రవి, సాధు, రంగరాజు, కొర్ర అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి: కాంగ్రెస్ అభ్యర్థి బుల్లిబాబు

పాడేరు : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 27న శనివారం కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ షర్మిల పాడేరు రానున్నారని ఆ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సతక బుల్లిబాబు తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు పాడేరు సతకం పట్టు వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండలంలోని సూకూరుపుట్టులో ఆయన స్వగృహం వద్ద శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధి చేయని టిడిపి, వైసిపిలు ఎలా ఓట్లు అడుగుతాయని కాంగ్రెస్ పార్టీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి సతక బుల్లిబాబు ప్రశ్నించారు.గిరిజనులను మోసం చేసిన టిడిపి, వైసిపిలు ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎలా ఓట్లు అడుగుతాయన్నారు. మండలంలోని సూకూరుపుట్టులో ఆయన స్వగృహం వద్ద శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. పాడేరులో శనివారం నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారుఎస్టీ కమిషన్ లో సభ్యుడుగా ఉన్న ప్రస్తుత పాడేరు అసెంబ్లీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఎలా ఓట్లు అడుగుతారన్నారన్నారు.

వైసిపి పాలనలో అభివృద్ధి ఏదీ?

-ఉమ్మడి అభ్యర్థి గిడ్డి ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు: వైసీపీని గద్దె దించాలని పాడేరు అసెంబ్లీ టీడీపీ ఇంచార్జ్, పాడేరు కూటమి అభ్యర్థి గిడ్డి ఈశ్వరి పిలుపునిచ్చారు. శుక్రవారం పాడేరు కుమ్మరి పుట్ ఆమె స్వగృహంలో ప్రత్యేక వేదిక వద్ద బీజేపీ,టీడీపీ జనసేన ఉమ్మడి ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రానికి రాజధాని లేదని, సర్పంచ్ లకు అధికారాలు ఇవ్వక పోవడంతో అభివృద్ధి లేదన్నారు. ఎస్సి ఎస్టీ సబ్ ప్లాన్ నిదులు లేవన్నారు. ఉమ్మడి ప్రభుత్వం వస్తే సూపర్ 6 పథకాలు అమలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనసేన ఆరకు పార్లమెంట్ ఇంచార్జ్ గంగులయ్య ,టీడీపీ సీనియర్ నాయకులు బొర్రా నాగ రాజు, మాజీ పాడేరు ఎంపీపీ బొర్రా విజయరాణి, మాజీ జి సి సి చైర్మన్ ప్రసాద్, బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కురుసా ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

నీటిని పట్టుకుంటున్నరోగుల బంధువులు

ఆసుపత్రిలో నీటి సౌకర్యం ఏర్పాటు

ప్రజాశక్తి-ముంచంగిపుట్టు: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నీటి సమస్యపై ఆసుపత్రి వార్డులో చేరిన రోగులు ఇచ్చిన ఫిర్యాదు, వార్తా కథనాలకు స్పందించిన డాక్టర్ గీతాంజలి శుక్రవారం తాత్కాలికంగా నీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సామాజిక ఆరోగ్య కేంద్రంలో బోరుబావి నీరు అడుగంటి పోవడంతో గత రెండు వారాలుగా ఆసుపత్రిలో రన్నింగ్ వాటర్ సమస్య తలెత్తిందన్నారు. నూతన బోరుబావి ఏర్పాటు చేసేందుకు నివేదికలు ఉన్నతాధికారులకు పంపించామన్నారు. అవసరాలకు వినియోగించేందుకు తాత్కాలికంగా తాగునీరు, రన్నింగ్ వాటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. వారం రోజుల్లో నూతన బోరుబావి ఏర్పాటుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. నీటి సౌకర్యం ఏర్పాటు చేయడంతో రోగులు, బాలింతలు, గర్భిణీలు ఉపశమనం పొందారు.

తాగునీటి పైప్

మాట్లాడుతూన్నా సిఐ సన్యాసి నాయుడు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రజలు సహకరించాలని సీఐ సన్యాసి నాయుడు కోరారు.ప్రతిరోజు ఒక్కొక్క గ్రామంలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.శుక్రవారం ఒడిశా సరిహద్దు గ్రామాలైన కామయ్యపేట, తీగల వలసలో సమావేశం ఏర్పాటు చేశారు.పోలింగ్ బూత్‌ల వద్ద ఎటువంటి గొడవలు లేకుండా పటిష్ట భద్రతకు ఏర్పాట్లు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గుంపులుగా ఉండకూడదని, ర్యాలీకి వాహనాల అనుమతులు తీసుకోవాలన్నారు. పర్మిషన్ లేకుండా మైక్ సెట్, వెహికల్స్ ఉపయోగించినట్లయితే ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతూరులో నీటి కష్టాలు

- -ఎర్రంపేట తాగునీటి పథకం నిర్మాణంలో నాణ్యతాలోపం
- -పైపులు పగిలిపోయి వృథాగా పోతున్న నీరు
- -కుళాయిల నుండి సక్రమంగా సరఫరా కాని వైనం
- -మరమ్మతులకు గురైన చేతి పంపులు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల కేంద్రంలోని పలు కాలనీలతో పాటు, ఎర్రంపేట తాగునీటి పథకం ద్వారా నీటి సరఫరా అవుతున్న 26 గ్రామాల్లో నీటి కోసం ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎర్రంపేట తాగునీటి పథకం పైపులు పగిపోయి నీరు వృథాగా పోతుండడంతో కుళాయిల ద్వారా ప్రజలకు సక్రమంగా నీరు అందడం లేదు. ఉన్న చేతి పంపులు కూడా మరమ్మతులకు గురి కావడంతో నీటి కోసం నానా కష్టాలు పడుతున్నారు.

వైసిపి ప్రభుత్వ హయాంలో చింతూరు మండలంలోని ఎర్రంపేట గ్రామంలో రూ.14 కోట్లు నాబార్డ్ నిధులతో రక్షిత మంచినీటి పథకాన్ని 2022 మార్చి 19న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి చేతుల మీదుగా ప్రారంభించారు. 60 వేల మీటర్ల నీటి సామర్థ్యం గల ఈ ఓవర్ హెడ్ ట్యాంకులోకి శబరి జలాలను ఎక్కించి, శుద్ధి చేసి ఫిల్టర్ బెడ్ ద్వారా 26 గ్రామాలకు నీటి సరఫరా చేసేందుకు ఈ మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు.

అయితే ఈ పథకం నిర్మాణంలో నాణ్యాత లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఎక్కడికక్కడ పైపులు పగిలిపోయి నీరు వృథాగా పోతుంది. నీరు లీకేజీ కావడంతో తాగునీటి పథకాలకు నీరు ఫోర్స్‌గా వెళ్లకపోవడంతో కుళాయిల నుండి నీరు సక్రమంగా రావడం లేదు. మరికొన్ని ప్రాంతాల్లో కుళాయిల పైపులు వేసి మధ్యలోనే విడిచిపెట్టారు. దీంతో మండలం కేంద్రంలోని ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ, గుబేలుపేట, గొల్ల బజారు, వాడబజారు తదితర ప్రాంతాల్లో కుళాయిల నీరు అందకపోవడంతో ప్రజలకు మంచినీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎర్రంపేట తాగునీటి పథకం నుండి నీరు సరఫరా కావాల్సిన 26 గ్రామాలకు ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు గుబేలుపేటలో, బీసీ కాలనీలో చేతిపంపులు సైతం పని చేయడం లేదు. అయినా వాటికి మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తాగునీటి పథకం పైపులు నాణ్యమైనవి వేయాలని, చేతిపంపులకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



ఎర్రంపేట తాగునీటి పథకం

అసంపూర్తిగా వదిలేసిన పైపులైన్లు

పాడైపోయిన బోరు

కుళాయిల ద్వారా నీరు రావడం లేదు

కులాయిల ద్వారా నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. తాగడానికి కూడా నీరు సరిపోవడంతో లేదు. బట్టలు ఉతకడానికి, వాడుకకు శబరి నదికి వెళ్లాల్సి వస్తుంది. మా బజార్లో ఉన్న బోరు పూర్తిగా పాడైపోయింది. అంగన్వాడీ కేంద్రానికి ఎదురుగా ఉన్న బోరు మోటర్ కూడా పాడైపోయి చాలా కాలమైంది. ఆవతలి బజారులో ఉన్న బోరుకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకోవటం జరుగుతుంది. వెంటనే బోరు మరమ్మతు చేసి మంచినీటి సౌకర్యం కల్పించాలి.

- రోషమ్మ, బిసి కాలనీ, చింతూరు

నీటి కోసం ఇబ్బంది పడుతున్నాం

పంచాయతీ కుళాయిల నీరు వారానికి ఒకటి రెండు సార్లు మాత్రమే వస్తుంది. వేసవికాలం కావడంతో నీటి వాడకం అధికంగా ఉంటుంది. నీరు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నాం డ్రైనేజీ బురదలో నుండి పైపులైన్లు వేసే వేశారు. గత్యంతరం లేక ఆ పైపు నీళ్లనే వేడి చేసుకుని చల్లార్చి తాగుతున్నాం. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు.

- తుర్రం కాంతమ్మ, గుబేలుపేట, చింతూరు

ఓట్లు వేయించుకొని ముఖం చాటేశారు

మా బజార్లో చేతిపంపు పూర్తిగా పాడైపోయి ఒకటి రెండు బిందెలు నీళ్లు మాత్రమే వస్తున్నాయి. మళ్లీ గంట తర్వాత గాని నీరు రావడం లేదు. బోరు లోని గొట్టాలు తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడటంతో ఈ పరిస్థితి నెలకొంది. రోడ్లు వేస్తామని, తాగునీరు అందిస్తామని ఓట్లు వేయించుకొని, తీరా గెలిచాక ముఖం చాటేశారు. ఇప్పటికైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

- మర్లపాటి గోపెమ్మ, గొల్ల బజార్, చింతూరు.

కరపత్రాలను విడుదల చేస్తున్న సిపిఐ, కాంగ్రెస్, సిపిఎం నాయకులు

సమన్వయంతో ప్రచారం

సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీల సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-చింతూరు

సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు (ఇండియా వేదిక) బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంట్, రంపచోడవరం శాసనసభ అభ్యర్థుల గెలుపునకు సమన్వయంతో ప్రచారం చేయాలని సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు మూడు పార్టీల సమన్వయ సమావేశం శుక్రవారం సిపిఎం కార్యాలయంలో జరిగింది. ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థులు పి అప్పలనర్స (అరకు ఎంపీ అభ్యర్థి) లోతా రామారావు(రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి)ల గెలుపు కోసం పట్టుదలతో ప్రచారం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు ఎస్‌కె.రంజాన్, కాంగ్రెస్ నాయకులు షేక్ అహమ్మద్ అలీ, బొక్కిలి ప్రసాద్, బొక్కిలి కన్నారావు, ఎస్‌కె.అక్బర్, సిపిఎం నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్, పోడియం లక్ష్మణ్, కలుమల్ల మల్లేష్ పాల్గొన్నారు.

జోన్ బాధ్యులతో సమావేశం

విఆర్.పురం : మండలంలోని రామవరం గ్రామ పంచాయతీ పరిధిలోని రామవరం జోన్ బాధ్యులతో సిపిఎం మండల కార్యదర్శి సోయం చిన్నబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ నాయకులు పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థుల విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఇప్పటి నుండి పోలింగ్ రోజు వరకు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించాలని పిలుపునిచ్చారు.

మారెమ్మ పండగకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఈ నెల 28న జరుగు మారెమ్మతల్లి ప్రధాన పండగకు దూర ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకున్న ఆర్టీసీ అధికారులు విశాఖ నుండి సీలేరుకు రెండు ప్రత్యేక బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టారు. ఒక బస్సు శనివారం ఉదయం 10 గంటలకు విశాఖపట్నం కాంప్లెక్స్‌లో బయలుదేరి నర్సీపట్నం మీదుగా సీలేరు సాయంత్రం ఐదు గంటలు చేరుకుంటుంది. మరో బస్సు శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి సీలేరు రాత్రి 8 గంటలకు చేరుకుంటుంది. ఈ బస్సులకు రిజర్వేషన్ సౌకర్యం లేదు. ఆది, సోమవారాల్లో మాత్రమే ఒక బస్సును మాత్రమే నడపనున్నారు. ఇంతకుముందు ఉన్న పగటిపూట, రాత్రి తిరిగే నైట్ బస్ సర్వీసులు యథాతథంగా తిరుగుతాయని, ప్రయాణికులు ఎటువంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. మారమ్మ ఉత్సవాల్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణికుల సౌకర్యార్థం అదనంగా ఏర్పాటు చేసిన బస్ సర్వీసుల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అనారోగ్యంతో ఎంపిటిసి ప్రసాద్ మృతి

ప్రసాద్ (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం వంచుల పంచాయతీ సిరిబాల గ్రామానికి చెందిన వైసిపి ఎంపీటీసీ సభ్యులు జోరంగి ప్రసాద్ అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలో మృతి చెందారు. మన్యంలో గిరిజనుల హక్కుల కోసం, బాక్సైటుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ప్రసాద్ చురుకైనా పాత్ర పోషించారు. ప్రసాద్ మృతి తీరంలోటని గ్రామస్తులు, వైసీపీ నాయకులు నివాళులర్పించారు.

ఉత్తమ బోధన శారద నికేతన్ సొంతం

-టెన్త్‌లో జిల్లా టాపర్‌గా మెరిసిన కౌశిక్
-పలువురు విద్యార్థులకు మంచి మార్కులు
-అధునాతనంగా సైన్స్‌ల్యాబ్, లైబ్రరీలు

విశాలమైన స్థలంలో ఉన్న శారదా నికేతన్ స్కూల్

ప్రజాశక్తి-అరకులోయ :మట్టిలో మాణిక్యాలు గిరిజన విద్యార్థులు. గిరిజన విద్యార్థిని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారనడానికి శారదా నికేతన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఫలితాలు రుజువు చేస్తున్నాయి.

టెన్త్ ఫలితాల్లో శారద నికేతన్ పాఠశాల విద్యార్థి కొర్ర కౌశిక్ ఏకంగా అల్లూరి జిల్లాలోనే టాపర్గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి జిల్లాకే టాపర్గా నిలిచాడు. దీంతో, ఆ విద్యార్థికి విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు సన్మానాలు చేస్తూ అభినందిస్తున్నారు. ఇది వరకు మైదాన ప్రాంతంలో ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలకే పరిమితమైన ఉత్తమ ఫలితాలు ఇప్పుడు శారదా నికేతన్ విద్యార్థులు కూడా తామేమి తక్కువ కాదు అన్నట్లుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తుంది..

ఈ పాఠశాలలో ఈ ఏడాది 22 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాశారు. వీరిలో కుర్ర కౌశిక్ 589 మార్కులు సాధించి అల్లూరి జిల్లా టాపర్గా నిలువగా, కొర్ర అనూష 555, పట్నాల మోహిత్ 548, అంపూలు సునీల్ 528, కిల్లో కావ్య శ్రీ 521, గొల్లూరి మనోహర్ 520, మజ్జి సంధ్య 514, గేమిలి హారిక 513, గూడెన శివరామరాజు 509 మార్కులు సాధించి తమ సత్తా చాటారు.

అలాగే షేక్ సహిదబేగం 499, కొర్ర ప్రియదర్శిని 497, దొర స్టీఫెన్ సన్ మనోహర్ 486, బంతు జగదీష్ బాబు 452, కొర్ర మనోహర్ 448, చింతాడ సామ్యూల్ పాల్ 441, తాంగుల సునీత 429, సందడి సాయి 428, ధనుంజయ్ గుప్తా 422, టీ వీక్లీప్ బాబు 422, ఆశి ధనుష్ రెడ్డి 388, కొర్ర నవీన్ 376, కొర్ర పూజ 339 మార్కులు సాధించారు. ఈ పాఠశాల విద్యార్థులు 22 మందికి 22 మంది పాసై శత శాతం ఉత్తీర్ణత సాధించారు.

అరకులోయలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సర్పగూడా హౌసింగ్ కాలనీ సమీపంలో విశాలమైన ప్రదేశంలో డి.శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో శారదా నికేతన్ పాఠశాల నడుపుతున్నారు. డి.శారద ఆశయ సాధన కోసం గిరిజన ప్రాంతంలో నాణ్యమైన క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఈ ప్రాంత విద్యార్థిని, విద్యార్థులు ఉన్నత స్థాయిలో చేరుకొని ఈ ప్రాంత అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్న లక్ష్యంతో 2007లో శారద నికేతన్ పాఠశాలను శారద ట్రస్టు నెలకొల్పి ఇంగ్లీష్ మీడియం విద్యనందిస్తున్నారు.ఎల్‌కేజి నుంచి 5వ తరగతి వరకు ప్రారంభమైన ఈ పాఠశాలలో నాణ్యమైన విద్య నందించడంలో ముందడుగులో ఉండటంతో దినదినం అభివృద్ధి చెందుతూ 10వ తరగతి వరకు అప్‌గ్రేడ్ అయింది. ప్రస్తుతం 920 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడమే కాకుండా ఎల్కేజీ నుంచి టెన్త్ క్లాస్ వరకు కూడా కంప్యూటర్ విద్య పరిజ్ఞానం నేర్పిస్తున్నారు. సైన్స్ ల్యాబ్, విశాలమైన ఆటస్థలం, విద్యార్థుల మేధస్సును పెంచేందుకు ప్రత్యేకమైన లైబ్రరీ, ఆర్వో ప్లాంట్, ప్రత్యేకమైన టాయిలెట్ల సదుపాయం, విశాలమైన ప్లే గ్రౌండ్ తదితర ప్రత్యేకమైన సదుపాయాలు ఉన్నాయి. అంతే కాకుండా, నాణ్యమైన విద్యను అందించే క్వాలిఫైడ్ టీచర్స్ ఉన్నారు.

ప్రిన్సిపాల్ చిరంజీవి పర్యవేక్షణలో ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచే కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్యార్థులు చదువు పట్ల మంచి ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రతి ఏడాది సమ్మర్లో ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ, ఏపీఆర్ కోచింగ్ నిర్వహిస్తున్నారు. మెడికల్ క్యాంపులు వంటి సామాజిక కార్యక్రమాలు కూడా నిర్వహించి శారదానికేతన్ తనదైన ముద్ర వేసుకుంది. ఉచిత నవోదయ పరీక్ష కోచింగ్, ఇతర స్కిల్ డెవలప్మెంట్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో, శారద నికేతన్ పాఠశాల అరకులోయకే పరిమితం కాకుండా ఏజెన్సీ వ్యాప్తంగా విస్తరించడంలో భాగంగా 2019 విద్యా సంవత్సరంలో అతి తక్కువ ఫీజుతో ముచంగిపుట్టలో కూడా ఏర్పాటు చేశారు.



అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్

నాణ్యమైన బోధనతోనే ఉత్తమ ఫలితాలు

శారదా నికేతన్ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన తోనే టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధ్యపడింది. తమ పాఠశాల విద్యార్థి జిల్లా టాపర్గా నిలవడం ఆనందంగా ఉంది. ఉత్తమమైన విద్య బోధనకు ఇది కొలబద్ద. విద్యార్థిని, విద్యార్థుల చదువుపై ప్రత్యేకమైన శ్రద్ధ, పర్యవేక్షణ, పాఠశాల అబివృద్ధి కమిటీ సలహా, సూచనలతో ఈ ఫలితాలు సాధ్యమైంది.



ఎస్.చిరంజీవి.
ప్రిన్సిపాల్ శారదా నికేతన్ పాఠశాల

జోరుగా వాసుపల్లి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం 27వ వార్డు వైసిపి నాయకులు సర్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో దొండపర్తి జంక్షన్‌లో శ్రీ ఎరుకుమాంబ ఆలయంలో పూజలు చేసి ప్రచార ర్యాలీ ప్రారంభించారు. ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మాజీ కార్పొరేటర్ జివి.రవిరాజు, పద్మనాభం అమ్మాజి తదితర ముఖ్య నాయకులు పాల్గొని వాసుపల్లితో పాటు ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ కూటమి కుండబద్దలు కొడతామని, దక్షిణంలో అత్యధికంగా ఉండే మైనారిటీలు తమకు అండగా నిలవనున్నారని తెలిపారు.

డెయిరీ కాలుష్యంతో ప్రజల అవస్థలు

- పలువురు కిడ్నీ, శ్వాస సంబంధిత వ్యాధులతో సతమతం
- 30 వేల మందిపై తీవ్ర ప్రభావం
- సొంతిళ్లను సైతం వదిలిపోతున్న పరిసర వాసులు
- నోరెత్తని టిడిపి, వైసిపి
- కాలుష్య నియంత్రణకు ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం

డెయిరీలో మిల్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లోని బాయిలర్స్

విశాఖ డెయిరీ కాలుష్యం గాజువాక నియోజకవర్గ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వందల మంది కిడ్నీ, శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారు. కాలుష్య నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు ఆ విషయాన్నే విస్మరించడంతో కాలుష్య సమస్య ప్రజల ప్రాణాలు తీస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీల్లో సిపిఎం మాత్రమే ప్రజల పక్షాన కాలుష్య సమస్యపై పోరాడుతోంది.

(ప్రజాశక్తి -గాజువాక)

సమీకృత ఆహారం పాలు.. పాలు, పాల పదార్థాలను తింటే ఆరోగ్యానికి మంచిదనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆ పాలను ప్యాకెట్లలో నిల్వ ఉంచేందుకు, వివిధ ఆహార పదార్థాలుగా మార్చేందుకు నిర్వహించే ప్రాసెసింగ్ ప్రక్రియలో వెలువడే నీటి, వాయు కాలుష్యంతో డెయిరీ ప్లాంట్ పరిసర ప్రాంతాల వాసులు నానా అవస్థలకు, అనారోగ్య సమస్యలకు గురవుతూ ఇక్కట్లు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న సొంతిళ్లను సైతం వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి అద్దెకు ఉంటున్నారంటే ఇక్కడ ఎంతగా కాలుష్యం వెలువడుతుందో ఇట్టే అర్థమౌతుంది. విశాఖ డెయిరీ కాలుష్యంతో జనం పడుతున్న ఇక్కట్లును దాని యాజమాన్యంగానీ, ప్రజాప్రతినిధులుగానీ పట్టించుకున్న దాఖలాలు లేవు.

పారిశ్రామిక ప్రాంతం గాజువాకలో జివిఎంసి 68వ వార్డులో దాదాపు 30 ఏళ్ల క్రితం విశాఖ డెయిరీని నెలకొల్పారు. మొదట్లో వేల నుంచి లక్ష లీటర్ల వరకు పాల సేకరణ చేపట్టి, వాటిని ప్రాసెసింగ్ చేసేవారు. అయితే అప్పట్లో అంతగా కాలుష్యం వెలువడేది కాదు. కాలక్రమేణా విశాఖ డెయిరీ ప్లాంట్ విస్తరణ చేపడుతూ నేడు రోజుకు 9 లక్షల లీటర్ల వరకుపాలను సేకరిస్తోంది. ఈ పాల ప్రాసెసింగ్ ప్రక్రియలో భాగంగా 75 డిగ్రీల సెంటిగ్రేట్ వద్ద వీటిని వేడి చేయాలి. దీనికోసం రెండు బొగ్గు బాయిలర్లు, మరో రెండు ఫర్నెస్ ఆయిల్‌తో నడిచే బాయిలర్స్‌ను నెలకొల్పారు.

ఆయిల్ ధర ఎక్కువగా ఉండడంతో సంబంధిత బాయిలర్స్ నిర్వహణా వ్యయం ఎక్కువ కావడంతో ఎక్కువగా బొగ్గు బాయిలర్స్‌పైనే ప్రాసెసింగ్ చేస్తున్నారు. దీనికోసం రోజుకు టన్నున్నర వరకు బొగ్గు అవసరమౌతున్నట్లు సమాచారం. దీంతో నాణ్యమైన బొగ్గు ధర, సేకరణ కొంత భారంతో కూడుకుని ఉండడంతో నాసిరకం బొగ్గును కొనుగోలు చేసి వాడుతున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఉదయంపూట బొగ్గు బాయిలర్స్‌ను వినియోగించడంతో వెలువడే పొగ, కాలుష్యం వల్ల ఇబ్బందులు పడ్డ పరిసర ప్రాంతాల ప్రజల నుంచి ఫిర్యాదులు పెరగడంతో, ఇప్పుడు రాత్రి సమయంలో బొగ్గును వినియోగిస్తున్నారు.

నాసిరకం బొగ్గుతో తీవ్రమైన దుమ్ము, పొగ కాలుష్యం

పాల ప్రాసెసింగ్ చేసే బాయిలర్స్‌లో నాసిరకం బొగ్గును వినియోగించడం వల్ల, విపరీతమైన దుమ్ము చెలరేగి, పరిసర అక్కిరెడ్డిపాలెం, సింగపూర్ కాలనీ, రాంనగర్, పంచవటి కాలనీ, మింది తదితర ప్రాంతాల్లో బొగ్గు ధూళి జనాలను ఇబ్బందుకు గురిచేస్తోంది. మరోవైపు పొగ కాలుష్యంతో వాటిని పీల్చిన జనాలు అనారోగ్యం పాలౌతున్నారు. ఊపిరితిత్తులు కేన్సర్, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతోపాటు కీళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఊపిరితిత్తుల కేన్సర్‌తో ఇద్దరు మహిళలు మృతి చెందారని, ఇంకా ఎందరో అస్వస్థతకు గురై అవస్థలు పడుతున్నారని స్థానికులు చెప్పుకొచ్చారు.

వ్యర్థజలాలతో భూగర్భం విషతుల్యం

డెయిరీలో సేకరించిన పాలను వేడి చేయడానికి ఎస్ఎస్ పైప్‌లైన్స్ కూడా ఉపయోగిస్తారు. ప్రాసెసింగ్ తర్వాత ఆ పైప్‌లైన్లు శుభ్రం చేయడానికి కాస్టిక్ సోడా, సిట్రిక్ యాసిడ్‌ను వినియోగిస్తుండడంతో తర్వాత వచ్చే వ్యర్థజలాలను డెయిరీ వెనక భాగంలో ఉన్న కాలువలోని చిన్న రంధ్రం ద్వారా దొడ్డిదారిన విడిచిపెడుతున్నారు. ఈ కాలువ అక్కిరెడ్డిపాలెం మీదుగా పంచవటి వరకు ప్రవహిస్తుడడంతో దీని ప్రభావంతో అక్కిరెడ్డిపాలెం, సింగపూర్ కాలనీ, పంచవటి కాలనీ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయని స్థానికులు వాపోతున్నారు. ఒకప్పుడు తాగడానికి వాడిన ఈ ప్రాంత జలాలను ఇపుడు బట్టలు ఉతుక్కోవడానికి కూడా పనికి రానంతగా కాలుష్యమయం అయ్యాయంటే, ఎంతగా ఇక్కడ భూగర్భం విషతుల్యమైందో అవగతం చేసుకోవచ్చని స్థానికులు అంటున్నారు. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తాగడానికి, వంటకు నీటిని కొనుక్కోక తప్పని పరిస్థితులున్నాయి. అంతేకాక ఈ వ్యర్థజలాలు, పొగ కాలుష్యంతో తీవ్రమైన దుర్వాసన వెలువడి రాత్రి వేళల్లో వాటి గాఢత వల్ల నిద్ర కూడా పట్టడం లేదని విశాఖ డెయిరీ పరిసర ప్రాంతాల ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ముక్కుపుటాలను అదరగొట్టే దుర్వాసన తమను ఉక్కిరిబిక్కిరి చేస్తోందని ఆవేదన చెందుతున్నారు.

ప్రజల గోడు పట్టని ప్రజాప్రతినిధులు, పాలకులు

విశాఖ డెయిరీ కాలుష్య సమస్యపై నాటి ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి నుండినేటి ఎమ్మెల్యే నాగిరెడ్డి వరకు మొత్తంగా టిడిపి, వైసిపిలకు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు మారినప్పటికీ, డెయిరీ కాలుష్యంపై వీరెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఆయా పార్టీలు అపుడు, ఇపుడు, ఎప్పుడూ డెయిరీ యాజమాన్యానికి వత్తాసు పలికేలా వ్యవహరించాయే తప్ప, ప్రజల పక్షాన ఆలోచించిన పాపాన పోలేదు.

అసెంబ్లీలో ప్రస్తావించిన నాటి సిపిఎం ఎమ్మెల్యే గఫూర్

విశాఖ డెయిరీ కాలుష్యంతో ఇక్కడి ప్రజలు పడుతున్న కష్టాలపై రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సిపిఎం ఎమ్మెల్యే గఫూర్ అసెంబ్లీలో ప్రస్తావించడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. 2005లో ప్రభుత్వం నియమించిన శాసనసభా కమిటీ విశాఖ డెయిరీని సందర్శించి, కాలుష్యంపై నిర్ధారణకు వచ్చింది.

డెయిరీ వ్యర్థజలాలను నిల్వ ఉంచడం గానీ, బయట కాలువల్లోకి విడిచిపెట్టకుండా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసి, నేరుగా సముద్రంలోకి వెళ్లేలా చూడాలని అప్పట్లో శాసన సభ కమిటీ సిఫార్సు చేసింది. అయితే కమిటీ సూచనలను యాజమాన్యం పెడచెవిన పెట్టింది. తర్వాత సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన అనేక ఆందోళనల ఫలితంగా ఉదయం పూట బొగ్గు బాయిలర్ల వాడకం తగ్గించి మభ్యపెట్టేలా డెయిరీ యాజమాన్యం వ్యవహరించిందే తప్ప, అసలు సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆందోళనలు చేపట్టిన సిపిఎం, ప్రజాసంఘాలు

విశాఖ డెయిరీ కాలుష్యంతో సుమారు 30 వేల మంది ప్రజలు పడుతున్న ఇబ్బందులపై సిపిఎం మాత్రమే పాదయాత్రలు పోరాటాలు, ధర్నాలు, ఇతరత్రా ఆందోళనలు చేపట్టింది. ఈ సందర్భంగా డెయిరీ యాజమాన్యం ప్రోద్బలంతో పోలీసుల ఆందోళన చేసిన సిపిఎం శ్రేణులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించిన సందర్భాలు చాలా ఉన్నాయి. ప్రజల పక్షాన సిపిఎం మాత్రమే పోరాటాలు చేసిన విషయాన్ని ఇప్పటికీ ఇక్కడి వారు గుర్తుచేసుకుంటారు.

డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి బయటకు వదిలేస్తున్న కాలుష్య కారక వ్యర్థజలాలు

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2 గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం 2.30 గంటల తరువాత వాతావరణంలో మార్పులు ఏర్పడి రెండు గంటల పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వాన కురిసింది.వివిధ పనులు నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు.

ముంచింగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ బొండపుట్టు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. పిడుగు పడటంతో చింత చెట్టు కింద గడ్డి మేస్తున్న ఆవు అక్కడికక్కడే మృతి చెందింది.

'విశాఖ' క్యాంపస్ డ్రైవ్‌లో 28 మంది ఎంపిక

ప్రజాశక్తి-పెందుర్తి : నరవలోని విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం స్పైడర్స్ కంపెనీ ఆధ్వర్యాన క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలలో 28 మంది ఎంపికైనట్లు కళాశాల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. సంవత్సరానికి రూ.3.50 లక్షల వేతన ప్యాకేజీతో ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ శ్రీధర్ పట్నాయక్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తులసినాయుడు అభినందించారు.

నూకాంబిక ఆలయంలో విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి అరుంధతినగర్‌లోని నూకాంబిక అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట, అన్న సమారాధన నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కంటిపాము కామేశ్వరి, వసంతల అప్పారావు, కె.విజయ్, సుకుమార్, సురేష్, గోవింద్, బోగి, నరసింగ్, కనకరాజు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిశక్తి ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి 92వ వార్డు పరిధి పద్మనాభనగర్ కొండపై ఉన్న ఆదిశక్తి నాగమనసాదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే కుంకుమ పూజలు, గౌరీ పూజ చేపట్టారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు. పశ్చిమ నియోజకవర్గం టిడిపి కూటమి అభ్యర్థి గణబాబు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కార్పొరేటర్ సేనాపతి వసంత, నందవరపు సోములు తదితరులు పాల్గొన్నారు

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 61వ వార్డుకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు శుక్రవారం కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యాన వైసిపిలో చేరారు. కొత్త నక్కవానిపాలెంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారికి పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసిపిలో కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి కార్యకర్తా సైనికుడిగా పనిచేసి ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి వార్డు అధ్యక్షులు జెవిఎస్ఎన్ రాజు, బోగవల్లి నాగభూషణం, దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

మామిడిలోవలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గంగునాయుడు ఆధ్వర్యాన శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎండిఒ కె.అప్పలనాయుడు సందర్శించి మాట్లాడారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. డాక్టర్ గంగునాయుడు మాట్లాడుతూ, వైద్య శిబిరాల్లో గుర్తించిన వ్యాధులకు అవసరమైతే పైఆసుపత్రులకు రిఫర్ చేసి వైద్యం అందేలా చూస్తున్నామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు డాక్టర్ ప్రవీణ్‌వర్మ, డాక్టర్ దీలిప్‌కృష్ణ వైద్య సేవలందించారు. ఈ శిబిరంలో 223 మందికి వివిధ వ్యాధులకు చికిత్స అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ పాల్గొన్నారు.

మరిన్ని వేసవి ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీకాకుళం రోడ్డు - తిరుపతి, కొచ్చువేలి - బరౌని - కొచ్చువేలి మధ్య ప్రత్యేక రైళ్లను నడపాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే నిర్ణయించింది. ఈ మేరకు 07440 తిరుపతి - శ్రీకాకుళం రోడ్ స్పెషల్ మే 5, 12 తేదీల్లో రాత్రి 20.05 గంటలకు తిరుపతిలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 08.05 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 08.10 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. 07441 శ్రీకాకుళం రోడ్డు -తిరుపతి ప్రత్యేక రైలు మే 06, 13 తేదీలలో మధ్యాహ్నం 15.00 గంటలకు శ్రీకాకుళం రోడ్‌లో బయలుదేరి సాయంత్రం 18:38 గంటలకు దువ్వాడ చేరుకుని 18.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరుపతి, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి మీదుగా ప్రయాణిస్తాయి.

06091 కొచ్చువేలి నుంచి బరౌని సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ మే 04 నుంచి జూన్ 29 వరకు ప్రతి శనివారం అర్ధరాత్రి 01.30 గంటలకు కొచ్చువేలిలో బయలుదేరి మరుసటి రోజు ఆదివారం ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 10.50 గంటలకు బయలుదేరి సోమవారం 13.55 గంటలకు బరౌని చేరుకుంటుంది. 06082 బరౌని - కొచ్చువేలి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బరౌనిలో మే 7 నుండి జూలై 2 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 15.30 గంటలకు బయలుదేరుతుంది. ఇది మరుసటి రోజు ఉదయం 04.18 గంటలకు దువ్వాడ చేరుకుని మరలా 04.20 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 9:55 గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈస్ట్‌కోస్ట్ రైల్వేలోని వాల్తేరు డివిజన్ పరిధిలో దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ మీదుగా ప్రయాణిస్తాయి.

పశ్చిమంలో 'రాజకీయ కూపన్లు'

- బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం : జెసి

ప్రజాశక్తి - విశాఖపట్నం : సాధారణ ఎన్నికలు జరుగుతున్న సందర్భంలో నగరంలోని కొంతమంది వైసిపికి చెందిన వారు 860 మందికి పెట్రోల్ కూపన్లు ఇచ్చిన వైనంపై రెవెన్యూ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలకు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 19న పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్ఎడి జంక్షన్‌లోగల టర్బానీ పెట్రోలియం ప్రొడక్ట్స్ పెట్రోల్ బంకును తనిఖీ చేయగా వైసిపికి చెందిన వ్యక్తుల ద్వారా ఈ కూపన్లు పంచిపెట్టినట్టు తేలిందని, వందల మందికి పెట్రోల్ పోయడం ద్వారా ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడ్డారని జెసి ధ్రువీకరించారు. సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసేందుకు స్థానిక రిటర్నింగ్ అధికారిని కోరినట్లు పేర్కొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో విశాఖ జాయింట్ సిపి ఫకీరప్ప నగరంలోని ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోగల కృష్ణా కాలేజ్, ఇతర సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను శుక్రవారం అకస్మాత్తుగా పరిశీలించారు. అక్కడ రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. పోలింగ్ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చేపట్టాల్సిన భద్రతా చర్యల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదేవిధంగా మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునేలా గట్టి చర్యలు చేపట్టాలని తెలిపారు.

డిఎడ్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్‌లో డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాల కోసం ఈ నెల 23 నుంచి మే 8 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు, రుసుము చెల్లించవచ్చని ప్రిన్సిపల్ ఎం.జ్యోతికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 21 నుంచి ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు పొందవచ్చని, మే 24న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మే 30న ఫలితాలు విడుదలవుతాయని వివరించారు. జూన్ 6 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఎంచుకుంటే, జూన్ 12 నుంచి కేటాయించిన డైట్ కళాశాల లో ప్రవేశాలు జరుగుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు www.apdeecet.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.